


# స్వార్థపరులకు గుణపాఠం చెప్పే కథ

**కర్లపాలెం హనుమంతరావు**

# ఆకాశరామన్న

అన్నింటితో పాటు పెళ్లిచూపుల పద్ధతుల్లో కూడా చాలా మార్పు వచ్చిందిప్పుడు. ఇదివరకయితే ఇంట్లో ఎదిగిన కూతురుందంటే కన్నవాళ్లకి పెళ్లి చేసిందాకా కంటిమీద కునుకుండేది కాదు. సంబంధాల కోసం తెలిసిన వాళ్లనూ, తెలీని వాళ్లనూ విచారిస్తూ ఉండేవాళ్లు. ఆ రోజుల్లో పెళ్లిళ్లపేరయ్యలదే ప్రధాన మధ్యవర్తి పాత్ర. వరసయిన కుర్రాడున్నాడని తెలిస్తే పిల్ల తరఫువాళ్లు వెళ్లి “ఒకసారొచ్చి పిల్లను చూసెళ్లవ”ని బలవంతపెడుతుండేవాళ్లు. వాళ్లొచ్చి చూసి అన్ని రకాలుగా అతికితే... భాజాభజంత్రీలు మోగేవి. పిల్ల నచ్చటం లాంటి ఒక్క విషయంలోనే వరుడికి స్వేచ్ఛ ఉండేది. వధువుకి ఆ హక్కూ లేదు. కట్నకానుకలూ... పెట్టిపోతలూ... లాంఛనాల్లాంటి వ్యవహారాలు పెద్దవాళ్లే... మరీ ముఖ్యంగా ఇంట్లో మగాళ్లే చూసుకునే వాళ్లు.

సుందరమ్మ పాతకాలం మనిషి కావటాన కూతురు సరోజను కూడా ఆ పద్ధతిలోనే పెంచింది. ఆ అమ్మాయి పెళ్లి విషయం కూడా పాత కాలంలో మాదిరిగానే మధ్యవర్తుల ద్వారా సంబంధాలు విచారించటంతో మొదలయింది. సరోజ తండ్రి గోపాలరావుగారు మెడికల్ డిపార్టుమెంట్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా చేస్తూ ఆమె పదో తరగతి చదివే రోజుల్లో కేన్సరొచ్చి పోయారు. మగదిక్కు లేని సుందరమ్మ గారు తోడబుట్టిన వాడి పంచన చేరింది. జిల్లాపరిషత్ స్కూల్లో హెడ్‌మాస్టరుగా చేసి రిటైరయిన అచ్యుతరామయ్య గారు కొడుకు మూర్తితోపాటు మేనకోడల్ని సమానంగా చదివించారు. మూర్తి సరోజకన్నా ఏడాది చిన్న. చదువులో మెరిక. అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడటానికేదో తంటాలు పడుతున్నాడు. ఆ పిల్లాడు వదిన కోసం రెండు మూడు మంచి సంబంధాలు చెప్పాడుగానీ సుందరమ్మగారే ఒక్కగానొక్క కూతురుని అంతంత దూరాభారాలు పంపించటం ఇష్టం లేక పడనీయలేదు. కష్టమొచ్చినా నష్టమొచ్చినా తన సాయం కావాలంటే వెళ్లటం కుదరదని ఆమె ఆలోచన. “ఇక్కడివే మంచివేమన్నా ఉంటే చూడన్నయ్యా!” అని అన్నను శతపోరుతూ ఉంది. అచ్యుతరామయ్య తాపీ మనిషి. ఏ విషయాన్నీ ఒక పట్టాన చెవికెక్కించుకోడు. పెళ్లాం కూడా ఆడపడుచు తరఫున వకాల్తా పుచ్చుకునేసరికి చివరికి పూనుకుని ఒక సంబంధం తీసుకొచ్చాడు.

అబ్బాయి బెంగుళూరులో ఏదో మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీరు. ఐదంకెల జీతం. పద్ధతైన కుటుంబం. “మనకు సరితూగే వాళ్లేనే. ఒకసారొచ్చి పిల్లను చూసుకోమని చెప్పొచ్చాను” అన్నారు అచ్యుతరామయ్యగారు ఆ పూట. పెళ్లిచూపులయ్యాయి.

సరోజ కంటికి నదురుగా ఉంటుంది. చదివింది బీ.టెక్ అయినా ఈ కాలం పిల్లలకుండే టెక్కు తక్కువ. మగపెళ్లి వాళ్లకు నచ్చింది. విధాయకంగా ‘ఏ సంగతీ రెండు మూడు రోజుల్లో చెబుతామ’ని వెళ్లారు గానీ.. మిగతా విషయాలు కుదిరితే ‘రడీ’ అనేందుకు సిద్ధంగానే ఉన్నట్లనిపించింది.

“వాళ్లు నోరు తెరిచి ‘ఇంత’ అని అడక్కపోయినా ఎంతో కొంత ఇద్దామన్నయ్యా! నాకు మాత్రం ‘ఇది’ తప్ప ఇంకెవరున్నారూ!” అంది సుందరమ్మగారు.

రెండు రోజులయినా బెంగుళూరు నుండీ ఏ కబురూ లేదు. ‘ఏమయిందని విచారిస్తే ‘మా పిల్లాడికి వేరే సంబంధం చూసుకున్నామ’నేశారు. “ముందు నచ్చినవాళ్లు తరువాతెందుకు వెనక్కి తగ్గారో కనుక్కుందామని ఎన్నిసార్లు ప్రయత్నించినా లాభం లేకపోయింది” అని వాపోయారు అచ్యుతరామయ్యగారు. అలాగే ఇంకో రెండు మూడు ‘మంచివి’ అనుకొన్న సంబంధాలు చివరిదాకా వచ్చి చెదిరిపోయేసరికి సుందరమ్మ డీలా పడిపోయింది. “ఈకాలం పిల్లలను గురించి ఏమీ చెప్పలేం. ముందు మన పిల్ల వైపు నుంచీ మతలబు ఏమన్నా ఉందేమో కనుక్కో!” అని హెచ్చరించింది ఆడబడుచు.

“నాన్న మీదొట్టు. నేనలాంటి దాన్ని కాదో”ని ఏడ్చింది సరోజ. పిల్ల జాతకం చూపించింది శాస్త్రులు గారికి. “కుజ దోషం ఉన్నా పరిహారమైపోయిందే! అమ్మాయి చేత ఈ కార్తీకమాసం మొత్తం పగటిపూట ఉపవాసం ఉంచి సాయంకాలానికి అమ్మవారి అర్చన చేయించండి. కొదమ దోషమేమన్నా మిగిలుంటే ప్రక్షాళన అయిపోతుంది” అని సలహా ఇచ్చారు శాస్త్రులుగారు.

సరోజ నియమనిష్టలతో దీక్ష శ్రద్ధగా చేసింది. ఆ తరువాతి నెలలోనే అనుకోకుండా గుండ్లపల్లి వారి సంబంధం వచ్చింది. ఖాయమైంది. అబ్బాయి చెన్నయ్‌లో ‘ఫిలిప్స్’ కంపెనీలో ఇంజనీరుగా చేస్తున్నాడు. సరోజకు చీటికి మాటికి కాల్స్ చేసి ‘స్వీట్ నథింగ్స్’ చెబుతున్నాడు. ఇదంతా కొత్తగా థ్రిల్లింగ్‌గా ఉన్నా... కొద్దిగా భయంగా కూడా ఉంది సరోజకు. సుందరమ్మగారికి తెలిసీ ఏమండీ ఏమయిపోతుందో నన్న జంకుతో సర్దుకుపోతూ ఉంది. పెళ్లి ఇంకో మూడు వారాలుందనంగా బట్టల కోసం చీరాల వెళ్లి వచ్చారు ఆడవాళ్లు. ఇంటికొచ్చే వేళకి చీకటి పడింది. వసారాల్లో అచ్యుతరామయ్యగారు కాలుగాలిన పిల్లిలాగా తచ్చర్లాడుతున్నారు. ఆయన ధోరణి చూసి ఏదో అయిందనుకుంది సుందరమ్మ. వినకూడనిదేమన్నా వినాల్సొస్తుందని భయపడుతూనే అడిగింది “ఏంటన్నయ్యా... ఏమన్నా కబురా?”

అచ్యుతరామయ్యగారు నిశ్శబ్దంగా ఒక కవరం దించారు. సుందరమ్మ వణికే చేతుల్తో దాన్నందుకుని తెరిచి చూసింది. అది పెళ్లికొడుకు తండ్రి రాసిన ఉత్తరం. గొలుసు కట్టు రాతతో ఏదేదో గోలగా రాసి ఉంది. “గోపాలరావుగారు సర్వీసులో ఉండగా మాకు చాలా సాయం చేశారు. ఆయన చలవ వల్లే మేమివాళ ఒంగోలులో మూడు మెడికల్ షాపులు నడుపుతున్నాం. ఆ విశ్వాసంతోనే వారి అమ్మాయిని కోడలుగా తెచ్చుకుందామని ఉబలాటపడ్డాం. కానీ... పెళ్లికి ముందే అనుభవం ఉన్న అమ్మాయి అంటే కుదరదు. ఇంతకు మించి చెప్పలేం. దీనితో పాటు జత చేసిన ఆకాశరామన్న ఉత్తరం చదివితే మిగతా విష

యాలు మీకే అర్థమవుతాయి" అని ఉంది. ఆకాశరామన్న తన ఉత్తరంలో సరోజను గురించి ఏవేవో రాశాడు.

'ఇంత దూరం వచ్చిన తరువాత ఇప్పుడు కాదంటే పిల్ల బతుకేమయిపోవాలం'టూ కూలబడిపోయింది సుందరమ్మ. సరోజే గుండె దిటవు చేసుకుని తల్లిని సముదాయించింది గానీ... లోలోపల ఆమె.. మనస్సూ రగిలిపోతూ ఉంది.

ఆకాశరామన్న రాసిన చెత్తను మళ్లీ శ్రద్ధగా చదివింది. ముందు ఆ ఖండాలాన్ని చించి పోగులు పెడదామనుకుంది గానీ... ఒక్క క్షణం ఆలోచించి భద్రంగా దాచేసింది. మనస్సును మళ్లించుకోటానికి ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టింది.


హైదరాబాద్ ఇ.సి.ఐ.ఎల్.లో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా ఆఫర్ వచ్చేసరికి తల్లి తీసుకుని వచ్చేసింది. ఏ.ఎస్.రావునగర్‌లో సింగిల్ బెడ్ రూం ఫ్లాట్‌లో ఉంటూ బెటర్ ఆఫర్స్ కోసం ట్రై చేస్తూ ఉంది. రోజులు గడుస్తున్నాయి. సుందరమ్మ పెళ్లి ప్రయత్నాలు మానలేదు. బెడిసి కొట్టినప్పుడల్లా 'టైము రాలేదు... ముడిపడటం లేదు' అని సరిపెట్టుకోవటం నేర్చుకుంది.

ఆ డిసెంబర్‌లో అమెరికా నుంచీ మూర్తి వచ్చాడు. తల్లికి ఏడాది నుంచీ తరచుగా ఫిట్స్ వస్తున్నాయి. ఎంతమంది డాక్టర్లకు చూపించినా నిదానించటం లేదు. ఎందుకొస్తుందో కూడా చెప్పలేకపోతున్నారు. నువ్వొకసారి వచ్చి చూసి పో... కుదుటపడుతుందేమోనని అచ్యుతరామయ్యగారు పోరగా పోరగా ఇప్పటికి తీరిక చేసుకుని దిగాడు మూర్తి. వచ్చిన మొదటి మూడు వారాలూ తల్లితోనే సరిపోయింది. చివరి వారం ఇది. అత్తను, సరోజను చూసి... ఇటు నుంచీ ఇటే విమానం ఎక్కుదామని ఇప్పుడు హైదరాబాద్‌లో దిగాడు.

సరోజా, మూర్తీ చిన్నప్పటి నుంచీ వదినా, మరుదులుగా కన్నా మంచి స్నేహితులుగా... కలివిడిగా ఉండేవాళ్లు. వయస్సులో పెద్దదైనా సరోజకు చాలా విషయాల్లో మూర్తి గైడెన్స్ కావాల్సొచ్చేది. మూర్తి అమెరికా వెళ్లిన మొదటి మూడేళ్లూ బాగా టచ్‌లోనే ఉండేవాడుగానీ...ఈమధ్యలోనే... ఎందుకో ఏడాది బట్టీ... కాంటాక్టులో లేకుండా పోయాడు. సరోజ సంబంధాలు బెడిసికొడుతున్న సంగతులు తెలుస్తున్నాయి గానీ అంత దూరంలో ఉండీ తనేమీ చేయలేకపోతున్నానని బాధపడేవాడు. ఇక్కడికొచ్చిన తరువాత తెలిసింది ఈ ఆకాశరామన్న అస్త్రాల గురించి. "నాకన్నా ఒక్కేడాది వెనక పుట్టుంటే నీకీ బాధ తప్పేది కదే!" అని జోక్ చేశాడు సరోజతో.

"నీకు చిన్నప్పట్నుంచీ యుగంధర్ నవలలంటే పిచ్చికదా! నీ బుల్లి బుర్రకీ చిన్న విషయం ఏమన్నా తడుతుందేమో చెప్పు" అంటూ ఆకాశరామన్న ఉత్తరం చూపించింది సరోజ. ఆ ఉత్తరాన్ని ఆసాంతం శ్రద్ధగా చదివి తిరిగిచ్చేశాడు మూర్తి. అప్పటికేమీ మాట్లాడలేదు. ఆ రోజు రాత్రి భోజనాల దగ్గర సుందరమ్మగారినడిగాడు మూర్తి. "అత్తా! అడక్కూడదో లేదో తెలీదు. ఒక్క రెండు లక్షలు అప్పుగా ఇస్తావా! ఒన్ ఇయర్‌లో తిరిగిచ్చేస్తా. ఈలోపు సరోజ మేరేజ్ ఫిక్సయితే ఎలాగో సర్దుతా. బ్యాంకు వడ్డీకన్నా ఒక శాతం ఎక్కువే ఇస్తాలే"

"వడ్డీదేముంది గానీ అలాగే తీసుకో. నీకన్నా కావాల్సిన వాళ్లెవరున్నారు కనక నాకు! మీ మామయ్య పోయినప్పుడు వచ్చినదంతా మీ నాయన దగ్గరే పెట్టాను. సరోజ పెళ్లప్పుడం టావా... అది ముడిపడినప్పుడు చూద్దాంలే" అంది సుందర



మ్మగారు.

"అయితే నాన్ననే అడుగుతాలే" అన్నాడు మూర్తి.

ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కబోతూ సెండాఫ్ ఇవ్వటానికొచ్చిన సరోజను "ఈ మాఘమాసంలో నీ పెళ్లి ఖాయం. నాదీ హామీ. పెళ్లికొడుకు నీ కలల రాజ కుమారుడే" అని ఆట పట్టించాడు.

మూర్తి అమెరికా వెళ్లిన పది రోజులకు చెన్నయ్ నుంచీ ఫిలిప్స్ కంపెనీలో పనిచేసే శ్రీధర్ సరోజకు కాల్ చేశాడు! సుందరమ్మ గారికేం చేయాలో పాలు పోక తెనాలిలో ఉన్న అన్నగారికి విషయం చెప్పింది. ఆయన ఏ కళనున్నాడో ఈసారి చెల్లెలు చెప్పిన వెంటనే శ్రమ అనుకోకుండా గుండ్లపల్లి వెళ్లి శ్రీధర్ తండ్రిని కల్సి వచ్చి సుందరమ్మగారికి విషయం చెప్పే శాడు. "ఇదివరకు వద్దనుకున్న సరోజనే ఇప్పుడు కావాలనుకుంటున్నారట. ఆకాశరామన్న ఉత్తరాలు పట్టుకుని మంచి సంబంధం వదలుకున్నందుకు వాళ్ల బ్బాయి బాగా కోప్పడ్డాడుట!" మొత్తానికి అంతా ఒక కలలాగా అలా జరిగిపోయింది. మూర్తి ఆటపట్టించి నట్లు ఆ మాఘమాసంలోనే సరోజ పెళ్లి శ్రీధర్‌తో ఘనంగా జరిగింది. సుందరమ్మ గుండె బరువు దిగింది. సరోజ చెన్నయ్ కాపురానికి వెళ్లిపోయింది.

ooo

ఆ రోజు ఆదివారం. ఉదయం ఎనిమిదయినా శ్రీధర్ పక్క దిగే మూడ్‌లో లేడు. సరోజ సెల్ అదే పనిగా రింగవుతూ ఉంది. శ్రీధరే విసుక్కుంటూ రిసీవ్ చేసుకున్నాడు. మూర్తి నుంచి కాల్ "సరోజ లేదా?" అనడిగాడు. "బాత్‌రూంలో స్నానం చేస్తోంది" అన్నాడు శ్రీధర్ నిద్రమత్తులోనే.

"సరే.. మీరేం చేస్తున్నారూ?" అనడిగాడు మూర్తి ఆరా తీస్తున్నట్లు.

"చెప్పక తప్పదా? ముందు మీరెందుకు కాల్ చేశారో చెప్పరాదా?"

"సరే... చెప్పద్దుగానీ నేను కాల్ చేసిందెందుకో చెబు తాను. మీరూ... మా సరోజ నాకింత నమ్మకద్రోహం చేస్తా రనుకోలేదు. అందుకే కాల్ చేస్తున్నాను" మూర్తి గొంతు లోని ఆకతాయితనాన్ని పసిగ ట్టాడు శ్రీధర్.

"మేమేం చేశాం మేన్?" అని బిత్తరపోయాడు.

సరోజ అప్పటికే బాత్‌రూం బైటికొచ్చి వింటూ ఉంది. శ్రీధర్ స్పీకర్ ఆన్ చేయ టంవల్ల మూర్తి మాటలు బైటికే వినపడుతున్నాయి.


"రాత్రి నాకు ఒక పీడ కల వచ్చింది బ్రదర్! మీకు ఒకమ్మాయి పుట్టిందట. మీరు 'ప్రహ్లాద' అనో... 'పంచ కళ్యాణి' అనో ఏదో పేరు పెట్టుకున్నారంట. ఇది చాలా అన్యాయం కాదా?"

"ఇందులో అన్యాయం ఏముంది?" అని అడి గింది సరోజ అయోమయంగా.

"కృతఘ్నురాలా! మీ బిడ్డకు నా పేరు కదా పెట్టా ల్సింది!" అనరిచాడు మూర్తి.

"అదేం ఫిటింగ్?" అనడిగాడు శ్రీధర్ సెల్ లాక్కొని.

"మీ ఇద్దర్నీ కలిపింది మూర్తి అని మరిచిపో




కండి. నిజంగా మీకు పుట్టిన పిల్లాడికైనా పిల్లకైనా ఆ మహాత్ముడి పేరు పెట్టడం మర్చిపోకండి. లేకపోతే..."

"ఏం చేస్తావు మూసుకో" అని లైన్ కట్ చేసింది సరోజ సరదాగా.


స్నానం చేసి ఫ్రెష్‌గా లేవెండర్ సోపు వాసనొస్తున్న సరోజను చూసి తట్టుకోలేక మీదకు లాక్కొన్నాడు శ్రీధర్. సరోజ విడిపించుకొంటున్నట్లు నటిస్తుండగా మళ్లీ సెల్ రింగ్... మూర్తే!


"మీ ఇద్దరికీ లైన్ కలిపింది నేను. నా లైనే కట్ చేస్తారా... ముందు నా పేరు పెట్టుకోవటం సంగతి తేల్చండి. అందాకా నేను..."

"నీకు సిగ్గూ.. శరం లేదా? కొత్త జంటను ఇలా విసిగిస్తావా?" అని మళ్లీ సెల్‌ని కట్ చేసింది సరోజ, శ్రీధర్ ఒడి లోకి ఒరి

## కరీనా కరీనాయే!

ఇటీవల వచ్చిన 'గోల్‌మాల్ రిటన్స్' సినిమా హిట్టవడంతో ఆ దర్శ కుడు ఆ సిరీస్‌ని కంటిన్యూ చేస్తున్నాట్ట. మరో 'గోల్‌మాల్' కోసం ప్రయత్నాలు చేస్తూ హీరోగా అజయ్ దేవ్‌గన్నే ఎంపిక చేసాట్ట. అయితే ఈసారి మాత్రం గోల్‌మాల్ రిటన్స్‌లో వున్న కరీనాని మాత్రం తీసుకోవద్దని దర్శకుడికి చెప్పాట్ట అజయ్. ఎందుకంటే ఆ సిని మాలో కరీనా అందర్నీ డామినేట్ చేసిందనేది అజయ్ ఫీలింగ్‌ట. ఓ వైపు కరీనా నట నని మెచ్చుకుంటూనే మరోవైపు ఆమెతో నటించడానికి భయపడుతున్నాడ న్నమాట అని చెవులు కొరుక్కుంటున్నారు సినీజనాలు.






గిపోతూ.

ఈసారి సెల్ రింగవుతుంటే శ్రీధరే అందుకుని "ఓకే బాబా! నీ పేరే పెట్టుకుంటాం. అందుకు ముందుగా మేము మా పని చెయ్యాలిగా" అన్నాడు సరెండరవుతున్న స్వరంతో.

"అలాగన్నారూ బాగుంది. నౌ గో ఎహెడ్.

బెస్టాఫ్ లక్ టు బోత్ ఆఫ్ యూ!" అంటూ లైన్ కట్ చేసేశాడు మూర్తి.

"మూర్తి మీకు ముందే తెలుసా?" అనడిగింది సరోజ శ్రీధర్‌ని.

చిన్నగా నవ్వి తలాడించాడు శ్రీధర్.

"ఎలా తెలుసు? మన పెళ్లికి కూడా రాలేదు కదా! నేను ఎప్పుడూ పరిచయం చేయలేదే!"

శ్రీధర్ కూల్‌గా చెప్పాడు. "మన పెళ్లి జరగటానికి మూర్తే ప్రధాన కారణం"

"మీకలా బిల్డప్ ఇచ్చాడా మహానుభావుడు! మా మామయ్య పూనుకొని చేస్తేనే అయింది ఈ సంబంధం" అంది సరోజ.

శ్రీధర్ చిద్విలాసంగా నవ్వుతూ "ఐతే నీకీ విషయాలేవీ తెలీవన్నమాట" అన్నాడు.

"ఏ విషయాలూ?!"

"మీ డాడీ సర్వీసులో ఉన్నప్పుడు సంపాదించిందంతా ఏసీబీ వాళ్లకు భయపడి మీ మామయ్య పేరుతో బ్యాంకులో దాచేవాడంట కదా! మీ మామయ్య ఆ సొమ్ముని మూర్తి అమెరికా చదువుకీ... మీ అత్తయ్య హాస్పిటల్ బిల్లులకీ హారతికర్పూరం చేసేశాడుట. కొడుకు స్థిరపడితే ఆ సొమ్ము క్షణాల్లో తిరిగివ్వచ్చని ఆయన ఆలోచన. ఈ లోపలనే పెళ్లి అనుకుంటే ఖర్చులకు తిరిగిచ్చే పొజిషన్‌లో లేడు మీ మామయ్య. అందుకని నీకొచ్చిన సంబంధాలన్నింటినీ ఆయనే ఏదో తిరకాసు వేసి తిరగగొట్టేశాడు. మా నాన్నకు వచ్చిన ఆకాశరామన్న ఉత్తరం రాసింది ఆయనే నంట. ఈ విషయాలన్నీ మూర్తి నాకు ఫోన్ చేసి చెప్పాడు. అతనా మధ్యలో ఇండియా వచ్చినప్పుడు నువ్వతనికి ఆకాశరామన్న ఉత్తరం చూపించావుట గదా! అప్పుడే తనకి అనుమానం వచ్చిందట. 'ఆ విషయం కన్‌ఫర్మ్ చేసుకోవటానికి మీ అమ్మను ఉత్తుత్తిగా అప్పు అడిగాడంట. డబ్బంతా మీ మామయ్య దగ్గరే ఉందని మీ అమ్మ చెప్పిందట గదా! మూర్తి మీ మామయ్యను తరువాత నిలదీశాడుట. ఆయన అన్ని విషయాలు బాధ పడుతూ చెప్పాడంట. ఈ విషయాలన్నీ నాకు చెప్పి 'ఒక్క పది లక్షల కోసం మా సరోజ కలలను భంగం చేయకండి. ఆ డబ్బు ఏడాది లోపల నేనిస్తాను. మా సరోజ చాలా మంచి పిల్ల. అమాయకురాలు. తనను చేసుకుంటే మీ జీవితాన్ని నందనవనం చేస్తుంది' అని ఎంతో ఎమోషనల్‌గా చెప్పి చాలా ఇదయ్యాడు. నిజం చెప్పాలంటే నేను కూడా నిన్ను పెళ్లి చూపుల్లో చూసినప్పటి నుంచీ మర్చిపోలేకపోయాను. మూర్తి చెప్పినట్లు బోడి ఒక పది లక్షల కోసం నిన్ను దూరం చేసుకోవటం మూర్ఖత్వమనిపించింది. అందులోనూ నేను ఆ ఆకాశరామన్న ఉత్తరాన్ని అస్సలు నమ్మలేదు. నీ లాంటి పిచ్చిపిల్ల అలాంటి చెత్త పనులు చెయ్యలేదని నాకు అనిపించింది. అయినా మా వాళ్లను కన్‌విన్స్ చేయటం నా వల్ల కాక అప్పటికి సైలెంటైపోయాను. మూర్తి చెప్పిన వివరాల్ని మా ఇంట్లో చెప్పి మా వాళ్లను ఒప్పించటానికి కొద్దిగా కష్టమయిందనుకో. మొత్తానికి పెళ్లి ఖర్చులకూ వాటికీ కావాల్సిన డబ్బును నేనే మూర్తి ఇచ్చినట్టు మీ మామయ్యకు ఇప్పించా. ఈ విషయాలన్నీ బైటికి చెబితే పాపం... మీ మామయ్య బాధపడతాడని నేనూ, మూర్తీ అనుకున్నాం. అందుకే నీకిప్పటి దాకా చెప్పలేదు" అన్నాడు శ్రీధర్.


"మరి మూర్తికి మీరిచ్చిన పది లక్షలూ?" అనడిగింది సరోజ.

"అబ్బ!... ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఎప్పటికో అప్పటికి ఇస్తాడులే! ఇవ్వకపోయినా ఫరవాలేదు. కోట్లకు మించిన ఈ బంగారాన్నిప్పించాడు కదా!" అని సరోజను మీదకు లాక్కున్నాడు.

"అయితే... మా మూర్తి పేరు నిజంగా పెట్టుకోవాల్సిందేనండీ!" అంది సరోజ శ్రీధరు ఒడిలోకి సర్దుకుంటూ.

"అయితే మరింక ఆలస్యం ఎందుకూ?" అంటూ లైటు ఆర్పేశాడు ఆ పొద్దుటి పూట.

○



## ప్చ్! కత్రినా!!

సల్మాన్ ఖాన్ తండ్రి సలీంఖాన్ ఈమధ్య ఓ పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో 'సల్మాన్-కత్రినాల పెళ్లి జరిగిపోయింది' అంటూ చెప్పడం పెద్ద దుమారాన్నే లేపింది. దీని గురించి కత్రినా వెంటనే స్పందిస్తూ 'అసలలాంటి పెళ్లి ఊసే లేదు. మా పెళ్లి జరగనేలేదు. లేనిదాన్ని అచ్చేసిన ఆ పత్రికపై కేసు వేస్తా' అంటూ గయ్యిమంది కత్రినా. ఈ మాటలు విన్న సలీం ఖాన్ కూడా నేనలా అనలేదే అంటూ నాలిక్కరుచుకున్నాడు. ఇదంతా పబ్లిసిటీ స్టంటేలెండి అని పెదవి విరుస్తున్నారు సినీజనాలు.